# ద్వితీయ సం॥ ఇంటర్‌మీడియట్

# తెలుగు

# IMPORTANT QUESTIONS

# పద్యభాగం

## 1. స్పర్థ

### ప్రతిపదార్థము - తాత్పర్యము

**1. తడవే లోరి పుళిందరాజ ! చను మధ్యాహ్నంబు డాయంగన**
**య్యెడు నీవేళ శివార్చనంబునకు మా కేకాంతమై యుండగాఁ**
**బడు నీవం గడు దస్పినాఁడ వటవీపంక్తి ప్రచారంబులన్,**
**విడు కోపం బిదె శాంతి గైకొనుము వాగ్వివాదమిం తేటికిన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఓరి పుళిందరాజ | = | ఓ పుళింద ప్రభువా! (ఓ చెంచు రాజా!) |
| తడవ | = | ఆలస్యము |
| ఏల | = | ఎందులకు ? |
| చను | = | (నీవు) ఇక్కడ నుండి వెళ్ళిపో |
| మధ్యాహ్నంబు | = | మధ్యాహ్న కాలము |
| డాయంగ నయ్యెడున్ | = | సమీపించబోతోంది (సమీపిస్తోంది) |
| (డాయంగన్ + అయ్యెడున్) | | |
| ఈ వేళ | = | ఈ సమయము |
| మాకున్ | = | మాకు |
| శివార్చనంబునకున్ | | |
| (శివ +అర్చనంబునకున్) | = | ఈశ్వరపూజకు |
| ఏకాంతమై | = | ఏకాగ్రమై (ఆ ఒక్క విషయమునే గుఱిగా చేసికొనినదై) (ఒంటరిగా) |
| ఉండగాఁబడున్ | = | ఉండవలసి యుంటుంది; (ఉండాలి) |
| నీవన్ | = | నీవు కూడా |
| అటవీ పంక్తి ప్రచారంబులన్; | | |
| అటవీ పంక్తి | = | అడవుల వరుసలలో |
| ప్రచారంబులన్ | = | ఎక్కువగా తిరగడం చేత |
| కడున్ | = | మిక్కిలి |

www.sakshieducation.com

| | | |
|---|---|---|
| డస్సినాడవు | = | అలసిపోయావు |
| కోపంబు | = | (నీ) కోపమును |
| విడు | = | విడిచిపెట్టు |
| ఇదె | = | ఇదిగో |
| శాంతిన్ | = | శాంతిని |
| గైకొను | = | గ్రహించుము (శాంతమును అవలంబించుము) |
| ఇంత | = | ఇంతగా |
| వాగ్వివాదము (వాక్ + వివాదము) | = | మాటలతో కలహము (వాక్కలహము) |
| ఏటికిన్ | = | ఎందులకు ? |

**తాత్పర్యం :**

ఓ పుళిందరాజా! ఆలస్యము ఎందుకు ? నీవు ఇక్కడ నుండి వెళ్ళిపో. మధ్యాహ్నకాలము సమీపిస్తోంది. ఈ సమయము మాకు శివుని అర్చించడానికి ఏకాంతముగా ఉండవలసిన అవసరం ఉంది. నీవు కూడా అడవులలో సంచారము చేయడం వల్ల బాగా అలసిపోయావు. కాబట్టి కోపాన్ని విడిచిపెట్టు. శాంతిని వహించు. ఇంతగా ఈ మాటల కలహం ఎందుకు ?

**విశేషము :**

"వాగ్వివాదము" – విడదీస్తే (వాక్ + వివాదము) అవుతుంది. 'ఉపసర్గస్యఘఞ్ అనే సూత్రముతో "వివాదములో "వి", దీర్ఘంగా మారి "వాగ్వీవాదము' అవుతుంది. ఈ ప్రయోగంలో తప్పలేదు.

**2.** **శివలింగార్చన మెందువోయెడుఁ దపస్విత్వమ్మునెందే నుప**
**ద్రవముం బొందదులే యొకింతవడిలో ధ్యానానుసంధానముల్**
**వ్యవధానం బొకయింత సైంచవొకో బాహావిక్రమశ్రీమహో**
**త్సవమం జూపుదుగాక నాయెదుర నాశ్చర్యం బవార్యంబుగన్.**

జ. **ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| శివలింగార్చనము | = | శివలింగ పూజ |
| ఎందువోయెడున్ | = | ఎక్కడకు పోతుంది |
| తపస్విత్వమ్మున్ | = | మునిత్వమును (నీ ముని ధర్మమును) |
| ఒకింత వడిలోన్ | = | ఒక కొంచెం సేపులో |
| ఎందేన్ | = | ఎక్కడనూ |
| ఉపద్రవమున్ | = | ఆపదను |
| పొందుదులే | = | పొందదులెమ్ము |
| ధ్యానానుసంధానముల్ (ధ్యాన + అనుసంధానముల్); | | |
| ధ్యాన | = | నీ శివ ధ్యానమును |
| అనుసంధానముల్ | = | నీ శివ నామ స్మరణమును |
| వ్యవధానంబు | = | వ్యవధిని (ఎడమును) |

| | | |
|---|---|---|
| ఒకయింత | = | ఒక కొంచెం సేపు |
| సైచవౌకొ | = | సహింపవా ? |
| | | (ధ్యానాను సంధానములు తర్వాత చేయవచ్చునని భావం) |
| నా యెదురున్ | = | నా ఎదుట |
| ఆశ్చర్యంబు | = | ఆశ్చర్యము |
| అవార్యంబుగన్ | = | ఎక్కువ అయ్యేటట్లుగా |
| బాహావిక్రమ శ్రీ మహోత్సవమున్; | | |
| బాహా విక్రమ | = | (నీ) భుజ పరాక్రమము అనే |
| శ్రీ | = | లక్ష్మి యొక్క |
| మహోత్సవమున్ | = | గొప్ప పండుగను |
| చూపుదుగాక | = | చూపిద్దువుగాని |

**తాత్పర్యం :**

నీ శివలింగపూజ ఎక్కడకూ పోదు. నీ మునితత్వానికి, ఎక్కడా లోటు రాదు. నీ శివధ్యానము, నీ శివస్మరణము అనేవి, కొంత వ్యవధిని సహింపకపోవు. అధికమైన ఆశ్చర్యము కలిగేటట్లు, నా ముందు నీ బాహు పరాక్రమ లక్ష్మి యొక్క మహోత్సవాన్ని చూపించు.

## 20 పంక్తుల సమాధాన ప్రశ్నలు

**1. అర్జునుడు కిరాతునితో పలికిన పలుకులెట్టివి ?**

జ. తాను కొట్టిన పందిని అర్జునుడు కొట్టాడనీ, అది వేట ధర్మానికి విరుద్ధమనీ, అర్జునుడు శవం మీద బాణం వేసిన వెఱ్ఱివాడనీ, కిరాతుడు అర్జునుడిని నిందించాడు.

**అర్జునుడి శాంతి వచనాలు :** ఓ కిరాతుడా! మీదకు వచ్చే క్రూర జంతువును చేతినేర్పుతో కొట్టడం, సిగ్గుపడవలసిన విషయము కాదుకదా! నీవు వంకర మాటల మాట్లాడుతున్నావు. నీ దారిన నీవు పో,

ఓ కిరాతరాజా! నీవు పందిని కావాలని కోరుతున్నావో ! లేక పందెం జయించాలని కుతూహలపడుతున్నావో తెలియదు. నీవు వేటాడడంలో గల ప్రయోజనము విషయంలో ఏదో రహస్యం ఉండి యుంటుంది. ఎందుకు నీవు ఈ విధంగా మాట్లాడుతున్నావు ?

ఓ పుళింద రాజా! ఆలస్యము ఎందుకు ? ఇపుడు మధ్యాహ్నకాలం సమీపించబోతోంది. ఈ వేళలో ఈశ్వరార్చనకు మాకు ఏకాంతము కావాలి. నీవు కూడా అడవులలో తిరిగి బాగా అలసిపోయావు. కాబట్టి కోపాన్ని విడిచి శాంతం వహించు. ఇంత వాగ్వాదము ఎందుకు ?

ఓ కిరాతరాజా! నీ భార్య, నీవూ, కుక్కల గుంపు, నీ అనుచరులూ గొప్పగా అడవిలో వేటాడిన పరిశ్రమచేత అలసిపోయారు. ఈ మా తపోవన ప్రాంతంలో మీరు ఉండాలనుకుంటే, మీరు సుఖంగా ఉండడం బాగుంటుంది అని అర్జునుడు కిరాతుని శాంతపరుస్తూ మాట్లాడాడు.

**2. కిరాతుడు అర్జునుని యుద్ధానికి ప్రేరేపించిన తీరు వివరించండి.**

జ. **కిరాతుని గర్వపు పలుకులు :** "ఓరీ నీవు ఎవరవు ? నేను ఈ పందిని చంపుతానని ప్రతిజ్ఞ చేసి దీని వెనకాల వస్తుండగా నీవు దీన్ని కొట్టి చంపావు. నా కుతూహలాన్ని పాడుచేశావు. తపస్వివై యుండి నీవు

విల్లు ధరించడం తగదు. శాంతిపరులకు జంతుహింస పనికిరాదు. మరొక వేటకాడు కొట్టిన జంతువును నీవు కొట్టావు. శవము మీద బాణం వేశావు. నీవు వెఱ్ఱివాడవా?' అని కిరాతుడు అర్జునుడిని నిందించాడు.

తన మీదకు వచ్చిన జంతువును కొట్టడం ధర్మమే అనీ, వివాదం వద్దనీ అర్జునుడు సామ్యవచనాలు మాట్లాడాడు.

**కిరాతుడు అర్జునుడిని యుద్ధానికి ప్రేరేపించడం :** అర్జునుడు చెప్పిన మాటలను గర్విష్ఠియైన కిరాతుడు వినకుండా, తన ముఖాన్ని అడ్డంగా త్రిప్పి అర్జునుడితో తిరిగి ఇలా అన్నాడు.

1) ఈ అసందర్భపు మాటలతో ప్రయోజనం లేదు. ఈ పంది నాకు ముఖ్యం కాదు. నీవు వేట పంతాన్ని తప్పి, మమ్మల్ని ధిక్కరించావు. నీవు తపసివి కాబట్టి నేను నిన్ను శిక్షింపను. ?

2) నీవు తాటియంత విల్లు ధరించావు. నీ భుజాలు వింటినారి రాపిడితో కాయలు కాచాయి. నీలో గర్వరేఖ కనబడుతోంది. నీ తపస్విత్వం కపటమైనది.

3) ఎందుకో నిన్ను చూసి, నా భార్య సన్నిధిలో నా హృదయము చాపాన్నీ చేతపట్టాలని కోరుకుంటోంది. నీ బాహు ప్రతాపము మేరలేనిదయితే కొంచెం సేపు దాన్ని విజృంభింపచెయ్యి నాపై వాడియైన క్రూరబాణాలను ప్రయోగించు.

4) నేను హీనజాతివాడైన చెంచువాడనని నన్ను వంచింపకు. యుద్ధంలో నన్ను నీవు మెప్పిస్తే, నిన్ను 'సెబాసు' అని మెచ్చుకుంటాను.

5) ఇంతటిలో నీ శివలింగార్చన ఎక్కడికీ పోదు. నీ తపస్విత్వానికి భంగం రాదు. నీ ధ్యానానుసంధానములు, ఆ మాత్రం వ్యవధిని సహింపకపోవు. బాహుపరాక్రమలక్ష్మిని నా ముందు ప్రదర్శించు.

6) నీవు బాణాన్ని ఎక్కుపెట్టు. నేను పందిపై కుతూహలం కలవాడిని కాను. నా భార్య సైతం భయంకరమైన వీరుల యుద్ధాన్ని చూడాలని కోరుకుంటుంది. ఈ విధంగా మాయా కిరాతుడు అర్జునుడిని తనతో యుద్ధం చేయుమని ప్రేరేపించి, తన వింటినారిని మోగించి, అర్జునునికి కోపాన్ని తెప్పించాడు.

## సందర్భ సహిత వాఖ్యలు

**1. శబర పొమ్మనీ నీచనుత్రోవన్**

జ. **కవి పరిచయం :** ఈ వాక్యం శ్రీనాథ మహాకవి రచించిన 'హరవిలాసం' లోని సప్తమాశ్వాసం నుండి గ్రహింపబడిన స్పర్ధ అనే పద్యభాగంలోనిది.

**సందర్భం :** తాను ముందుగా కొట్టిన పందిని, అర్జునుడు తన బాణంతో కొట్టడం వేటలో న్యాయము కాదని, మాయా కిరాతుడైన శివుడు అర్జునుడిని నిందించాడు. అప్పుడు అర్జునుడు మీదికి వచ్చే క్రూరజంతువును చేతినేర్పుతో కొట్టడం, అనే విషయము సిగ్గు పడవలసిన విషయము కాదనీ, కిరాతుడు వంకర మాటలు మాట్లాడుతున్నాడనీ చెప్పి, అతని దారిన అతనిని పొమ్మని కిరాతునికి, అర్జునుడు హితవు చెప్పిన సందర్భం లోనిది.

**అర్థం :** ఓ చెంచువాడా! నీ దారిన నీవు వెళ్ళు.

**వ్యాఖ్య :** 'మీదికి వచ్చే క్రూర జంతువును నేర్పుతో కొట్టడం, సిగ్గుపడవలసిన విషయం కాదు. నీవు వంకరగా మాట్లాడుతున్నావు. నీ దారిన నీవు పో" అని అర్జునుడు శబరునికి హితమును ఉపదేశించాడు.

## సంక్షిప్త సమాధాన ప్రశ్నలు

**1. తపసి ఎటువంటి లక్షణాలు కలవాడు ?**

జ. 1) 'తపసి' అయిన అర్జునుడు, తాటిచెట్టు అంత ప్రమాణము గల 'గాండివం' అనే విల్లును ధరించాడు.

2) తపస్వి అయిన అర్జునుడు తన బాహుదర్పమును ప్రదర్శించి, వరాహము పార్శ్వములు గాడి పడేలా బాణమును ప్రయోగించాడు.

3) ఆ తపస్వియైన అర్జునుడు, మధ్యాహ్న సమయంలో నిత్యమూ శివార్చనము చేస్తాడు.

4) తపస్వి అయిన అర్జునుని బాహువులు "జ్యాకిణాంకితములు" అయి ఉన్నాయి.

5) ఆ తపస్విలో గర్వరేఖ బాగా కనబడుతోంది.

6) ఆ తపస్వియైన అర్జునుడు నిత్యమూ ఏకాంతంగా మధ్యాహ్న సమయంలో ఈశ్వరుని ధ్యానానుసంధానములు సాగిస్తాడు.

## ఏకవాక్య సమాధాన ప్రశ్నలు

**1. శివుని చాపము పేరేమి ?**

జ. శివుని చాపం పేరు "పినాకం".

**2. 'వాసవసూతి" అని ఎవరిని అంటారు ?**

జ. వాసవసూతి అని అర్జునుడిని అంటారు.

**3. "పురారి" అనగా ఎవరు ?**

జ. 'పురారి' అనగా త్రిపుర సంహారకుడయిన ఈశ్వరుడు.

**4. అర్జునుడు ఏ పర్వతంపై తపస్సు చేసేవాడు ?**

జ. అర్జునుడు ఇంద్రకీల పర్వతంపై తపస్సు చేసేవాడు.

**5. కిరీటి ధనుస్సు పేరేమి ?**

జ. కిరిటీ ధనుస్సు పేరు "గాండివం".

**6. శ్రీనాథుడు రచించిన రెండు గ్రంథాల పేర్లు తెలపండి.**

జ. శ్రీనాథుడు రచించిన రెండు గ్రంథాల పేర్లు ఇవి.

1) శృంగార నైషధం 2) హరవిలాసం.

**7. "స్పర్ధ" పాఠాన్ని ఏ గ్రంథం, ఏ ఆశ్వాసం నుండి గ్రహించారు ?**

జ. 'స్పర్ధ' పాఠము 'హరవిలాసం' అనే గ్రంథంలోని సప్తమాశ్వాసం నుండి గ్రహించారు.

**8. హరవిలాసములో ఎన్ని ఆశ్వాసాలు ఉన్నాయి ?**

జ. హరవిలాసంలో ఏడు ఆశ్వాసాలు ఉన్నాయి.

**9. శ్రీనాథుని బిరుదమేమి ?**

జ. శ్రీనాథుని బిరుదము 'కవి సార్వభౌముడు,

**10. హరవిలాసాన్ని శ్రీనాథుడు ఎవరికి అంకితమిచ్చాడు ?**

జ. హరవిలాసాన్ని శ్రీనాథుడు "అవచితిప్పయసెట్టి"కి అంకితం ఇచ్చాడు.

✡✡✡

www.sakshieducation.com